క్లుప్తంగా

టాలెంట్ టెస్ట్‌లో చిన్నారుల ప్రతిభ



మాజీ రాష్ట్రపతి వెంకయ్యనాయుడు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న తనుశ్రీ

అమరాపురం/హిందూపురం: అమరాపురం మండల పరిధిలోని ఉదుగూరుకు చెందిన తనుశ్రీ , హిందూపురం పట్టణంలోని పాంచజన్య పాఠశాలలో యూకేజీ చదువుతున్న ఎన్ఆర్. నిషిత ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన జాన్సన్ పబ్లికేషన్ విద్యాసంస్థ నిర్వహించిన టాలెంట్ టెస్టులో ప్రతిభ చూపారు. నిషిత రైమ్స్‌లో, తనుశ్రీ నృత్య ప్రదర్శనలో మొదటి బహుమతులు సాధించడంతో మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుడు ప్రశంసాపత్రాలు, షీల్డ్‌లను అందుకున్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మె నోటీసు



కమిషనర్‌కు సమ్మె నోటీసు ఇస్తున్న నాయకులు

హిందూపురం టౌన్: పురపాలక సంఘంలో మున్సిపల్ ఇంజనీరింగ్, పారిశుద్ధ్య కార్మికులు నవంబర్ 3 నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు ఏఐటీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్ వద్ద ఏఐటీయూసీ నాయకులు, కార్మికులు నిరసన తెలిపి, కమిషనర్ మల్లికార్జునకు సమ్మె నోటీసును అందించారు. సమ్మె కంటే ముందు వివిధ రూపాల్లో నిరసన తెలియజేస్తామన్నారు. నాయకులు బాబు, రవికుమార్, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన మద్యం డిపో ప్రారంభం



మద్యం డిపోను ప్రారంభిస్తున్న నాగముద్దయ్య

గోరంట్ల: మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలో బెల్లాల చెరువు రోడ్డు పక్కన ఏపీఎస్‌బీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నూతన మద్యం డిపోను సోమవారం ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగముద్దయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పరిధిలోని మద్యం దుకాణాలు, బార్లకు పాలసముద్రం వద్ద ఏర్పాటు చేసిన నూతన మద్యం డిపో నుంచి మద్యాన్ని సరఫరా చేస్తామన్నారు.

ఉచిత విద్యుత్ హామీని అమలు చేయండి



ఎమ్మెల్యే బాలకృష్ణకు వినతిపత్రాన్ని సమర్పిస్తున్న చేనేత కార్మికులు

హిందూపురం: నేతన్నలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా నేతన్న భరోసా పథకంతో పాటు చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సదుపాయాన్ని అమలు చేయించాలని చేనేత కార్మిక సంఘాల నాయకులు, కుటుంబాలు ఎమ్మెల్యే బాలకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. సంబంధిత మంత్రిని సంప్రదించి చేనేతలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బాలకృష్ణ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చేనేత ఐక్యవేదిక సభ్యులు దేవరాజు, బాబు ,సుభద్రా బాయి, అశ్వత్తమ్మ, చేనేతలు తదితరులు పాల్గొన్నారు.

గ్రానైట్ లారీల సీజ్



మడకశిర స్టేషన్ వద్ద ఉంచిన గ్రానైట్ లారీలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని పాపసానిపల్లి రోడ్డు మీదుగా కర్ణాటకకు తరలిస్తున్న రెండు గ్రానైట్ లారీలను సోమవారం తెల్లవారజామున విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. వే బిల్లు లేకపోవడంతో సీజ్ చేశారు. రెండు గ్రానైట్ లారీలను మడకశిర పోలీస్‌స్టేషన్ వద్ద ఉంచారు.

నకిలీ మద్యంపై కదంతొక్కిన వైఎస్సార్‌సీపీ

- హిందూపురం, పెనుకొండ, మడకశిరల్లో నిరసనలు
- చంద్రబాబు డౌన్ డౌన్ అంటూ ర్యాలీలు



నకిలీ మద్యానికి వ్యతిరేకంగా పెనుకొండలో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్, వైఎస్సార్‌సీపీ శ్రేణులు



హిందూపురం ఎక్సైజ్ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక, మధుమతిరెడ్డి పార్టీ శ్రేణులు

పెనుకొండ రూరల్: కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతున్న నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు కదం తొక్కాయి. పెనుకొండ పట్టణంలో సోమవారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగింది. పట్టణంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులతో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినదించారు. ఎక్సైజ్ కార్యాలయం ముందు ధర్నా చేశారు.

నకిలీ మద్యంపై సీబీఐతో విచారించాలి

మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐ విచారణకు ఆదేశించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా నకిలీ మద్యం ఏరులై పారుతుందన్నారు. ప్రతి గ్రామంలో బెల్ట్ షాపులు వెలిశాయని, గ్రామాల్లో కూల్ డ్రింక్స్ అయినా దొరకుతాయో లేదో గానీ, మద్యం మాత్రం ఫుల్లుగా దొరకుతోందన్నారు. కంబాలపల్లి, ఇబ్రహీంపట్నాలలో కూటమి నేతలు కుటీర పరిశ్రమలను స్థాపించి కల్తీ మద్యం తయారు చేసింది నిజం కాదా? అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కేవలం ప్రజలను తప్పు దోవ పట్టించేందుకే, నామమాత్రంగా పార్టీల నుంచి తాత్కాలికంగా తొలగించారన్నారు. నకిలీ మద్యం ద్వారా ఇప్పటి వరకూ రాష్ట్ర వ్యాప్తంగా 421 మరణాలు సంభవించినట్లు పత్రికలు, సోషల్ మీడియా ద్వారా వెలుగులోకి వస్తున్నాయన్నారు. నకిలీ మద్యం వ్యవహారంపై సీబీఐతో విచారణ చేయించాలన్నారు. మద్యంపై వైఎస్సార్‌సీపీపై నిందలు వేసి అక్రమంగా పలువురు నాయకులపై కేసులు నమోదు బనాయించారన్నారు. ఇప్పుడు అదే కల్తీ మద్యంతో కూటమి ప్రభుత్వం కంపు కొడుతుందన్నారు. నియోజకవర్గంలో బాటిల్‌పై పది రూపాయలు అదనంగా వసూలు చేస్తుంది నిజం కాదా అని ప్రశ్నించారు. అనధికారికంగా వసూలు చేసిన డబ్బులు ఎవరి జేబులోకి వెళ్తున్నాయో చెప్పాలన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పాలసముద్రం వద్ద రైతుల అవసరాలకు గోడౌన్లు కడితే ఇప్పుడు దాన్ని మద్యం సరఫరా కోసం వాడుకోవడం హేయమన్నారు. నియోజకవర్గానికి మంత్రి సవిత తీసుకొచ్చిన పరిశ్రమలు, చేసిన అభివృద్ధి ఏంటో ప్రజలకు చెప్పాలన్నారు. ప్రీకాట్ మిల్లులు మూతపడినా, మెడికల్ కళాశాలలు ప్రైవేటుపరం అయినా మంత్రి పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ పిలుపు మేరకు హిందూపురం పట్టణంలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయం ఎదుట వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఆధ్వర్యంలో సోమవారం భారీ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. బెల్టు షాపులు ఎత్తేయాలని, నకిలీ మద్యం అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్యకు వినతిపత్రం అందించారు.

గుడి, బడి తేడా లేకుండా బెల్ట్ షాపులు

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక మాట్లాడుతూ నియోజకవర్గంలో గుడి, బడి, ఆస్పత్రులు తేడా లేకుండా ఎక్కడ చూసినా బెల్టు షాపులు వెలిశాయని మండిపడ్డారు. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు పోతున్న కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లు అయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతేడాది హిందూపురం నియోజకవర్గంలో నకిలీ మద్యం పట్టుబడినా నేటికీ చర్యలు ఎందుకు తీసుకోలేకపోయారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే బాలకృష్ణ పీఏల ఒత్తిడితోనే కేసులో బడా బాబులున్నా చర్యలకు వెనుకడుగు వేశారని విమర్శించారు. వారి ఆదాయాన్ని పెంచుకునేందుకు ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బెల్టు షాపులు లేకుండా, మద్యం షాపులను పరిమితంగా ఏర్పాటు చేసిందని, కానీ ఇప్పుడు అందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం తీరు తయారైందన్నారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి మాట్లాడుతూ మొలకలచెరువు వద్ద నకిలీ మద్యం వ్యవహారంలో ఎంతటి వారినైనా వదలకుండా అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు వేణురెడ్డి, మండల కన్వీనర్లు రామకృష్ణారెడ్డి, సయ్యద్ నిస్సార్, రాము, ఎంపీపీ రత్నమ్మ, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి అమానుల్లా, మైనార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఫరూక్, జిల్లా బూత్ కమిటీ అధ్యక్షుడు వాల్మీకి లోకేష్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు మహేష్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి శివశంకర్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి తిప్పేరుద్రయ్య, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, రాష్ట్ర బూత్ కమిటీ సహాయ కార్యదర్శి వరుణ్‌రెడ్డి, మహిళా విభాగం, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు కవితారెడ్డి, రామాంజినేయులు, నాయకులు శ్రీరామిరెడ్డి, శబరీష్‌రెడ్డి, చిన్నప్పయ్య, అశ్వర్థరెడ్డి, అయూబ్, కౌన్సిలర్లు రోషన్ అలీ, షాజియా తదితరులు పాల్గొన్నారు.

మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చింది బాబే

- వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప



మడకశిరలో ర్యాలీలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, పార్టీ శ్రేణులు

మడకశిర: నకిలీ మద్యాన్ని అరికట్టి, బెల్ట్‌షాపులను ఎత్తేయాలంటూ సోమవారం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప నాయకత్వంలో ఆ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున మడకశిరలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. వైఎస్సార్ సర్కిల్ నుంచి ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వరకూ వందలాది మంది కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నారావారి కల్తీ మద్యాన్ని అరికట్టాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు చేశారు.అనంతరం స్థానిక ఎక్సైజ్ అధికారులకు వైఎస్సార్‌సీపీ నాయకులు వినతి పత్రాన్ని అందించారు. చంద్రబాబు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప విమర్శించారు. కల్తీ మద్యాన్ని చంద్రబాబు ప్రోత్సహిస్తున్నారన్నారు. చంద్రబాబు సొంత జిల్లా చిత్తూరులోనే కల్తీ మద్యం తయారీ కేంద్రాన్ని టీడీపీ నాయకులు ఏర్పాటు చేసి దోచుకోవడం ముఖ్యమంత్రి చేతకాని తనానికి నిదర్శనమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెదబాబు,చినబాబు కల్తీ మద్యాన్ని ప్రోత్సహిస్తూ దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ప్రజలకు కల్తీ మద్యాన్ని సరఫరా చేసి ప్రాణాలు తీస్తున్నారని మండిపడ్డారు. ఎక్సైజ్‌శాఖ మంత్రి పనితీరు చాలా అధ్వానంగా ఉందని, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర కాదని, కల్లు రవీంద్ర అని ఎద్దేవా చేశారు. నియోజకవర్గంలో ఊరూరా బెల్ట్ షాపులు ఉన్నాయని, అయినా ఎక్సైజ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. గ్రామాల్లోని బెల్ట్‌షాపులన్నీ ఎత్తి వేయాలని, లేకపోతే వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి ఆనందరంగారెడ్డి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు నరసింహమూర్తి, మండల కన్వీనర్లు రామిరెడ్డి, నరసింహారెడ్డి, పట్టణ కన్వీనర్ బోయ సతీష్‌కుమార్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం కార్యదర్శులు శ్రీరాములు, సత్యనారాయణయాదవ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అంజలి, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు శేషాద్రి, బూత్ విభాగం అధ్యక్షుడు మల్లికార్జున, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల అధ్యక్షులు సికిందర్, శివానంద్, నరసింహ, నాయకులు జయరాజ్, రంగనాథ్, హరి, వేమారెడ్డి, దశనాథరెడ్డి, రంగధామరెడ్డి, మధు, సురంగల నాగరాజు, లక్ష్మీనారాయణ, సర్పంచులు హనుమంతప్ప, కరియన్న, జగన్నాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న సమన్వయకర్త టీఎన్ దీపిక

చిలమత్తూరు: వైఎస్సార్‌సీపీ బలోపేతానికి ప్రతి ఒక్క వైఎస్సార్‌సీపీ కార్యకర్త సైనికుడిలా కష్టపడాలని ఆ పార్టీ సమన్వయకర్త టీఎన్ దీపిక పిలుపునిచ్చారు. హిందూపురం పట్టణంలోని 7వ వార్డులోని ముక్కిడిపేటలో వైఎస్సార్‌సీపీ వార్డు కమిటీని ఏర్పాటు చేసిన ఆమె మెడికల్ కళాశాలను పీపీపీ విధానంలోకి మళ్లించడాన్ని వ్యతిరేకిస్తూ కోటి సంతకాల సేకరణ చేపట్టారు. దీపిక మాట్లాడుతూ పార్టీ క్షేత్రస్థాయిలో బలంగా ఉంచడమే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. కోటి సంతకాల ద్వారా కూటమి కుట్రలు పటాపంచలు అవుతాయని, మెడికల్ కళాశాలలు ప్రైవేటీకరణ ఆగిపోతుందని ధీమా వ్యక్తం చేశారు. తద్వారా పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందుతాయన్నారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి అయూబ్ బైగ్, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి అమానుల్లా, ఫారుఖ్, బీసీ సెల్, మహిళా విభాగం, ఎస్సీ సెల్ అధ్యక్షులు రామాంజినేయులు, కవితారెడ్డి, మోహన్, నగేంద్ర, బాబ్జాన్, ఆసిఫ్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరుల అభ్యర్థన పట్టదా బాలకృష్ణా ?

చిలమత్తూరు: విలేకరులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన ఇన్‌చార్జి ఎంపీడీఓ రమణమూర్తిపై ఎమ్మెల్యే బాలకృష్ణకు ఫిర్యాదు చేస్తే ఏమాత్రం పట్టించుకోకపోవడంపై దారుణమని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక విమర్శించారు. విలేకరుల అభ్యర్థనపై ఇలాసేనా స్పందించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలోని పార్టీ కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎంపీడీఓ నోటి దురుసుతో విలేకరులను అవమానించడం సిగ్గుచేటన్నారు. దోపిడీదారులకు, అవినీతి పరులకు మాత్రమే ఎమ్మెల్యే బాలకృష్ణ అండగా ఉంటారేమో అని ఎద్దేవా చేశారు. ఉపాధి నిధులు, మండల పరిషత్ నిధులు పక్కదారి పట్టించి ఎవరికి మళ్లించారో తమకు తెలుసునని, ఆ అవినీతిని బయటకు తీస్తున్నారనే ఎంపీడీఓ విలేకరులపై అనుచితంగా మాట్లాడారన్నారు. ఎంపీడీఓ అవినీతి అక్రమాలపై కలెక్టర్ విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు.

సమన్వయకర్తకు సన్మానం

వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపికను కోడూరు నాయకులు హిందూపురం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఇటీవలే కోడూరు పంచాయతీ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు దీపిక, వేణురెడ్డి దంపతులను సత్కరించారు. మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, పంచాయతీ అధ్యక్షుడు అశ్వర్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ బుక్ పోస్టర్ల ఆవిష్కరణ



డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

చిలమత్తూరు: మండల కేంద్రంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి.. పార్టీ ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేష్‌కుమార్‌రెడ్డితో కలసి డిజిటల్ బుక్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. మండల కన్వీనర్ మాట్లాడుతూ కూటమి నేతల అరాచకాల కారణంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, కూటమి నేతలు, అధికారులు వల్ల ఇబ్బందులు పడే ప్రతి ఒక్క కార్యకర్త డిజిటల్ బుక్ ద్వారా తమ సమస్యను వివరించాలని కోరారు. సురేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రెడ్ బుక్ లాగా అరాచకాలు డిజిటల్ బుక్ లో ఉండవని, న్యాయపరంగా శిక్షించి తగిన శాస్తి చేసేలా మాజీ సీఎం వైఎస్ జగన్ రూపొందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాఘవేంద్రరెడ్డి, నియోజకవర్గ పంచాయితీరాజ్ విభాగం అధ్యక్షుడు కులశేఖర్‌రెడ్డి, లక్ష్మీపతిరెడ్డి,అశోక్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, దామోధర్‌రెడ్డి, సానె రంగారెడ్డి, రవీంద్రరెడ్డి, రామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

అగళి: మండల పరిధిలోని నరసాబుంది రేషన్ డీలర్‌పై కేసు నమోదు చేసినట్లు తహసీల్దార్ సుబ్బారావు తెలిపారు. సీఎస్‌డీటీ భాగ్యలక్ష్మి, ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, వీఆర్‌ఓ సూర్యప్రకాష్ వెళ్లి నరసబుంది రేషన్ షాపు తనిఖీ చేయగా రికార్డు ,స్టాక్ వ్యత్యాసం ఉన్నట్లు గుర్తించారన్నారు. రికార్డులు సక్రమంగా లేకపోవటంతో డీలర్‌పై కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. రేషన్ సరుకుల పంపిణీలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

రొళ్ల: స్థానిక వైఎస్సార్ సర్కిల్ ఆవరణలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రూపొందించిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి సంయుక్త ప్రకటన ద్వారా తెలిపారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు.

సీనియర్ న్యాయవాది మృతి



నాగభూషణరావు (ఫైల్)

హిందూపురం: పట్టణానికి చెందిన సీనియర్ న్యాయవాది నాగభూషణరావు అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. ఈ నేపథ్యంలో పలువురు న్యాయవాదులు ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

పీఈటీలను అప్‌గ్రేడ్ చేయండి

పెనుకొండ: ట్రైబల్ పండింట్ పీఈటీలను అప్‌గ్రేడ్ చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మారుతీప్రసాద్, జయకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. ప్రభుత్వ పంచాయతీరాజ్, మున్సిపల్ పాఠశాలల్లో పని చేస్తున్న భాషా పండితుల పీఈటీలను అప్‌గ్రేడ్ చేసిన ప్రభుత్వం ట్రైబల్ వెల్ఫేర్ వారిని విస్మరించడం తగదన్నారు.

దళితుల భూములను కాపాడండి

గుడిబండ: మండల పరిధిలోని ఎస్ రాయాపురంలోని దళితుల భూములను కూటమి నాయకులు అక్రమంగా ఆక్రమించారని, వాటిని కాపాడాలని సోమవారం మండల రెవెన్యూ తహసీల్దార్ శ్రీధర్‌కు సీపీఐ రైతు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య, రైతులు వినతిపత్రం అందజేశారు. కొంకల్లు పంచాయతీ సర్వే నంబర్ 180లో 34 ఎకరాల భూమి దళితులు సాగు చేస్తుండగా కొందరు బడా నాయకుల అండదండలతో ఆన్‌లైన్‌లో తమ పేర్ల మీద మార్చుకొని బ్యాంకుల్లో రుణాలు పొందారన్నారు. దీనిపై సమగ్ర విచారణ చేసి దళితులకు న్యాయం చేయాలన్నారు.

గోపాల మిత్ర బదిలీ ఆపాలని ధర్నా

సోమందేపల్లి: మండలంలోని చల్లాపల్లికి చెందిన గోపాల మిత్ర బదిలీను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ రైతులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంతో పాటు పశు వైద్యశాల వద్ద ధర్నా నిర్వహించారు. 16 ఏళ్లుగా దామోదర్ తమ గ్రామంతో పాటు వివిధ గ్రామాల్లో రైతులకు అందుబాటులో ఉండి పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారన్నారు. దామోదర్ సతీమణి సౌజన్య సర్పంచు కావడంతోనే బదిలీ చేశారని విమర్శించారు. డిప్యూటీ తహసీల్దార్ రెడ్డి శేఖర్, పశు వైద్యురాలు హేమలతకు వినతిపత్రం అందజేశారు.

దాక్టర్లకు మద్దతుగా నిరసన

పెనుకొండ రూరల్: పీహెచ్‌సీ డాక్టర్లకు మద్దతుగా గుట్టూరు గ్రామంలోని పీహెచ్‌సీ సిబ్బంది సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ సుందర్ రాజు, ఫార్మసీ అసిస్టెంట్ సుబ్బలక్ష్మి, సూపర్ వైజర్ నాగశేషమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఈ–కేవైసీ తప్పనిసరి

గుడిబండ: మండల వ్యాప్తంగా ఉన్న మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు లబ్ధిదారులు ఈ–కేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీఓ జగదీష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఇకపై ప్రతి ఈ–కేవైసీ చేసి, వారి ఫోటోతోనే పనులకు హాజరైన వారికి మాత్రమే ఉపాధి డబ్బులు పడతాయన్నారు.

టపాసుల దుకాణాల ఏర్పాటుకు స్థల పరిశీలన

అమరాపురం: స్థానిక మద్దనకుంట రోడ్డులో ఉన్న స్థలాన్ని సోమవారం తహసీల్దార్ లక్ష్మీ నరసింహా టపాసుల దుకాణాల ఏర్పాటు కోసం పరిశీలించారు. దీపావళి పండగను పురస్కరించుకుని మండల కేంద్రంలో టపాసుల దుకాణాలను ఏర్పాటు చేయడానికి ఐదు మంది దరఖాస్తు చేసుకున్నారు. దీంతో వారు ఎంపిక చేసిన స్థలాన్ని ఆయన వారితో కలసి పరిశీలించారు.

సంక్షిప్త సమాచారం

కాడు గొల్లల అభివృద్ధికి కృషి

పావగడ: తాలూకాలోని కాడు గొల్లల సామాజిక వర్గం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కాడు గొల్లల అభివృద్ధి కార్పొరేషన్ నూతన అధ్యక్షుడు హారోగెరె మహేశ్ తెలిపారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. జూలప్పనహళ్లి గ్రామంలో నిర్వహించిన పాలు పోసే పండుగలో ఆయన పాల్గొన్నారు. కలి నాగమ్మ ,కరియమ్మ ,జుంజప్ప దేవతలకు పూజలు చేశారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

గోరంట్ల: శ్రీకృష్ణదేవారాయుల జయంతి, వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని గోరంట్ల మండల బలిజ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండలంలోని బలిజ సంఘం నాయకులు పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

చిలమత్తూరు: మండల కేంద్రంలోని బైరేకుంట సమీపంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించడానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ భీముడు నాయక్ పేర్కొన్నారు. ఈ నెల 15 లోపు కళాశాలకు వచ్చి ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

యానిమేటర్‌పై ఫిర్యాదు

రొళ్ల: యానిమేటర్ తిమ్మరాజుపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ షేక్షావలి, ఏఎస్ఐ ఇదాయతుల్లాకు పొదుపు సంఘాల సభ్యులు ఫిర్యాదు చేశారు. జీబీ హళ్లి గ్రామంలో జేకే మారుతి, ధనలక్ష్మీ పొదుపు సంఘాల్లో సుమారు 24 మందికి పైగా సభ్యులున్నారని, కొందరి పేర్లతో రూ.4 లక్షల వరకూ డబ్బు తీసుకొని డబ్బు చెల్లించకుండా మోసం చేశాడని ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు పోస్టర్ల ఆవిష్కరణ

అగళి: మండల కేంద్రంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద మంగళవారం ఉదయం 11 గంటలకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల పోస్టర్లను ఆవిష్కరించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప హాజరవుతారని, పెద్ద ఎత్తున నాయకులు , కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో వాల్మీకి జయంతి



జ్యోతులు మోస్తున్న మహిళలు

పావగడ: తాలూకాలోని వైఎస్ హొసకోట హొబళీ పంచాయతీలోని రామకృష్ణాపురం గ్రామంలో మహర్షి వాల్మీకి జయంతి వేడుకలు సోమవారం వైభవంగా జరిగాయి. మహిళలు భక్తిశ్రద్ధలతో జ్యోతులు మోశారు. అనంతరం వాల్మీకి చిత్ర పటం వద్ద పూజలు చేశారు.

వీసా, పాస్‌పోర్ట్ పోగొట్టుకున్న విద్యార్థి

హిందూపురం: గుడిబండ మండలం మోరుబాగలుకు చెందిన సాయి సుకృత్ హిందూపురంలో డ్రైవింగ్ టెస్టుకు వచ్చి కంగారులో తన జార్జియా వీసా, పాస్‌పోర్టు , డ్రైవింగ్ లైసెన్స్, స్టూడెంట్ ఐడీ, డెబిట్ కార్డ్ తదితర వాటిని పోగొట్టుకున్నాడు. ఈ మేరకు సాయి సుకృత్ చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తాను అత్యవసర పరిస్థితిలో ఉన్నానని, ఈ నెల 23న జార్జియాకు ఫ్లెట్ టికెట్ కూడా బుక్ చేసుకున్నట్లు చెబుతున్నారు. ఐడీ, వీసా, పాస్‌పోర్టు లేకపోతే చదువు పూర్తిగా దెబ్బతింటుందని, ఎవరికైనా దొరికితే దయచేసి అప్పగించాలని అభ్యర్థిస్తున్నాడు.

ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్‌గా నరేంద్ర

పరిగి: మండలంలోని కొడిగెనహళ్లి ఏపీఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ పాఠశాల కొత్త ప్రిన్సిపాల్‌గా జి నరేంద్ర నియమితులయ్యారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డీఎస్సీ – 2025లో ఏపీఆర్ఎస్ ప్రిన్సిపాల్ నియామక పరీక్షల్లో ఎంపికైన నరేంద్ర శిక్షణ అనంతరం సోమవారం కొడిగెనహళ్లి ఏపీఆర్ఎస్‌కు వచ్చారు. ఇటీవలే బదిలీ అయిన ప్రిన్సిపాల్ మత్స్యరాజును కలిశారు. మరో రెండురోజుల్లో నరేంద్ర పదవీ బాధ్యతలను స్వీకరించనున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

పెనుకొండ: పట్టణంలోని మంత్రి సవిత క్యాంప్ కార్యాలయంలో సోమవారం పలువురు బాధితులకు మంత్రి సవిత సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. గుట్టూరుకు చెందిన రఫిక్ అహ్మద్‌కు రూ. 2.7 లక్షలు, వెంకటరెడ్డిపల్లికి చెందిన ఆంజినేయులుకు రూ.41 వేలు, పరిగి మండలం ఎర్రగుంట్లకు చెందిన కిష్టప్పకు రూ. 1.76 లక్షల చెక్కులను అందించారు.

వివిధ సమస్యలపై 16 అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివిధ సమస్యల పరిష్కారానికి 16 అర్జీలు అందినట్లు డీటీ ప్రసాద్ తెలిపారు. రెవెన్యూ, ఇతర సమస్యలపై వినతులు వచ్చాయన్నారు.

మున్సిపల్ పాఠశాలలకు తీరని అన్యాయం

హిందూపురం టౌన్: కూటమి ప్రభుత్వం చేపట్టిన మెగా డీఎస్సీ-2025లో మున్సిపల్ పాఠశాలలకు తీవ్ర నిరాశను మిగిల్చిందని మున్సిపల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు సోమవారం ఎంఈఓ కార్యాలయం వద్ద నూతనంగా నియమితులైన ఉపాధ్యాయులను ఎంటీఎఫ్ నాయకులు అభినందించి స్వాగతం పలికారు. వారు మాట్లాడుతూ పోస్టుల కేటాయింపులో మున్సిపల్ పాఠశాలలకు అన్యాయం జరిగిందన్నారు.